రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి

పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ నాయకుల పిలుపు

కేపీహెచ్‌బీ కాలనీ,ఏప్రిల్ 17: రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ కోరారు. గురువారం డివిజన్ లోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, పేదలకు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. మరోవైపు నగరంలో కరెంట్ కష్టాలు పెరిగాయని తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కాలనీలు, బస్తీలలో అభివృద్ధి పనులు పెరగడం లేదన్నారు. నేటి కాంగ్రెస్ పాలన దుస్థితిని ప్రజలకు వివరించాలని కోరారు. రజతోత్సవ సభకు భారీగా నాయకులు కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు భీమని సంతోష్ లక్ష్మీనారాయణ, కార్యదర్శి చేకూరి ప్రభాకర్, నేతలు నాయినేని అభిలాశ్‌రావు, బొట్టు విష్ణు, నర్సింగ్‌రావు, స్వప్నా రెడ్డి, లీల, రాజేశ్వరి పాల్గొన్నారు

బీఆర్ఎస్ శ్రేణులకు కృతజ్ఞతలు..

బాలానగర్: రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేద్దామని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం వినాయక నగర్ లోని ఆయన నివాస ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సన్నాహక సభకు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాల్సిన అవసరం అందరి పైన ఉందని తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు బీఆర్ఎస్ పార్టీకి సేవలందిస్తున్న శ్రేణులందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజాభిమానం చూరగొనడంలో బీఆర్ఎస్ ముందు వరుసలో ఉందన్నారు. కార్యక్రమంలో మందడి సుధాకర్ రెడ్డి, పంజా రామచంద్ర ముదిరాజ్, శాఖయ్య, ఖాజా, దారం సతీశ్, నర్రా దేవేందర్ రెడ్డి, రంగంపేట శ్రీనివాస్ ముదిరాజ్, రత్నం, మహేందర్ రెడ్డి, శేఖర్, ప్రేమ్ కుమార్, సుజాత గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి..

అల్లాపూర్: బహిరంగ సభకు ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం పిలుపునిచ్చారు. డివిజన్ పరిధిలోని గాయత్రీ నగర్ లో గురువారం కార్పొరేటర్ బీఆర్ఎస్ కార్యకర్తల తో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రజతోత్సవ సభ చలో వరంగల్ పోస్టర్ ను కార్పొరేటర్ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వరంగల్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించే రజతోత్సవ సభకు అల్లాపూర్ డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, నాగుల సత్యం, జాహేద్ షరీఫ్ బాబా, కృష్ణారావు, జ్ఞానేశ్వర్, బొల్లు శ్రీనివాసరావు, జావీదుద్దీన్, కొండం శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు తరలిరావాలి..

శేరిలింగంపల్లి: బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పిలుపునిచ్చారు. పెద్ద సంఖ్యలో శేరిలింగంపల్లి నుంచి కార్యకర్తలు తరలి రావాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో శేరిలింగంపల్లికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. గురువారం ఖాజాగూడలోని కార్యాలయంలో వాల్ పోస్టర్ ను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు కొండంత అండ గులాబీ జెండా అని అన్నారు. ఎల్కతుర్తి వద్ద పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో తరలి రావాలన్నారు. తెలంగాణను అభివృద్ధి చేసిన చరిత్ర కేసీఆర్ దేనని, దాన్ని పాడు చేసే ఆలోచనతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. రజతోత్సవ సభకు శేరిలింగంపల్లి లోని ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

కూకట్‌పల్లి బీఆర్ఎస్ నేతల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

చలో వరంగల్ పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

బీఆర్ఎస్ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ రవీందర్ రెడ్డి

వాల్‌పోస్టర్‌ను గచ్చిబౌలి డివిజన్ లో ఆవిష్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ కొమిరిషెట్టి సాయిబాబా

మత సామరస్యానికి ప్రతీక ఉర్సు

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, రాగిడి లక్ష్మారెడ్డి

దుండిగల్, ఏప్రిల్ 17: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని జీతేపీర్ దర్గా లో నిర్వహిస్తున్న ఉర్సు ఉత్సవాల్లో గురువారం బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా ఈ సందర్భంగా చాదర్ ను సమర్పించడంతో పాటు ముస్లిం సోదరుల తో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత సామరస్యానికి ఉర్సు ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయన్నారు. ఇక్కడ జరిగే ఉర్సు వేడుకల్లో కులమతాలకతీతంగా అందరూ పాల్గొనడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు కాసాని సుధాకర్, బాలాజీ నాయక్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు, మసీద్ కమిటీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ సలీమ్, చంద్రగిరి సతీశ్ నాయకులు ప్రవీణ్ గౌడ్, సలీం ఖాన్, కమిటీ అధ్యక్షులు మీర్ ఫరూక్ అలీ, ఉపాధ్యక్షులు సయ్యద్ అక్బర్, మహమ్మద్ ఖాజా పాషా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గాజుల రామారంలో.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజుల రామారం డివిజన్ పరిధి, లాల్ సాహెబ్ గూడ ఫేజ్- 2 లోని సైలాని బాబా దర్గా ఉర్సు ఉత్సవాలకు బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, చిన్నా చౌదరి, వాహిద్, అజయ్ గుప్తా, సాయి బాబా, మసూద్, సురేశ్, జునైద్ , శివ నాయక్ , ఆసిఫ్, ప్రసాద్, దర్గా కమిటీ సభ్యులు రసూల్ భాయ్, మౌలానా, శంషీర్, ఫరీద్ పాల్గొన్నారు.

ఆదరణ ఫౌండేషన్ సేవలు అభినందనీయం


వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, బాబు మోహన్

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 14: ఆదరణ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. ఆదరణ ఫౌండేషన్ 22వ వార్షికోత్సవం సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు అరిగెల రఘునాథ్ బాబు ఆధ్వర్యంలో జేఎన్టీయూహెచ్ ఆడిటోరియంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథులుగా కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ మంత్రి బాబు మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రిటైర్డ్ ఉద్యోగి రఘునాథ్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆదరణ ఫౌండేషన్ 2003 నుంచి నేటి వరకు సమాజంలోని పేదవారి కోసం కృషి చేయడం సంతోషకరమన్నారు. ఈ సేవలను నిర్విరామంగా కొనసాగించాలని సూచించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అరిగెల రఘునాథ్ బాబు, ప్రజా ఆలోచన ఐక్యవేదిక అధ్యక్షుడు విద్యా వెంకట్, పీఎస్ఆర్కే భగవాన్ సంజీవరావు, చినబాబు, రమేశ్ యోబు, సినీనటి శివ పార్వతి, నేతలు సతీశ్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, మైకల్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

సమస్యలు తెలుసుకుంటున్న ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ నరసింహయాదవ్

బాలానగర్, ఏప్రిల్ 17 : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని భవానీనగర్ లో జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి పైప్‌లైన్ వేయాలని, మ్యాహోల్స్ కవర్స్, సీసీ రోడ్డు వేయాలని డ్రైనేజీ క్లీన్, వ్యర్థాల తరలింపు తదితర సమస్యలను కార్పొరేటర్ కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలమండలి అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మ్యాన్ హోల్స్ పై మూతలు లేకపోవడం, సరిపడా తాగునీరు సరఫరా చేయకపోవడం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు క్లీన్ చేసిన డ్రైనేజీ వ్యర్థాలను సకాలంలో తొలగించుకోవడం వలన స్థానికులు మరింత ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని లేనిపక్షంలో ఆందోళన చేయక తప్పదన్నారు. ఏఈ ఆశ, జలమండలి ఏఈ తేజ, మేకల హరినాథ్, మట్టి శ్రీనివాస్, బుర్రి యాదగిరి, మోహన్ ముదిరాజ్, భవానీనగర్ అధ్యక్షులు సాయి లు, మన్నే ఉదయ్ యాదవ్, వెంకటేశ్, సుందర్, శేఖర్, ఈశ్వరమ్మ, సునంద, రమే శ్, సతీశ్, ఆంజనేయులు, రాము, వీరేశ్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 17: సహజంగా వేసవిలో జరిగే అగ్ని ప్రమాదాలపై ప్రజలు మరింత జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ, సివిల్ డిఫెన్స్ యంత్రాంగం బృందం అవగాహన కల్పించారు. ఈనెల 14 నుంచి 20 వరకు జరిగే అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం కొంపల్లి లోని సురక్ష చిల్డ్రన్స్ ఆసుపత్రి ప్రాంగణంలో డాక్టర్ ఎం. ఎస్ రెడ్డి సహకారంతో ఆసుపత్రి లోని సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ప్రతిక్షణం చాలా విలువైందని, అదే సమయంలో 101 డయల్ చేసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, తప్పుడు సమాచారం ఇవ్వకుండా ఆపదలో ఉన్నవారికి తక్షణ సహాయం అందేలా పౌరులు బాధ్యతతో ముందుకెళ్లాలన్నారు. వాణిజ్య వ్యాపార సంస్థల్లో ప్రతి ఒక్కరూ నిబంధనలకు అనుగుణంగా ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్స్ తో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు, యాజమాన్యం పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఎం ఎస్ రెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారులు

వేతనాలు చెల్లించాలని ధర్నా

ఆందోళన చేస్తున్న కార్మికులు

దుండిగల్, ఏప్రిల్ 17: దుండిగల్ మున్సిపాలిటీ లో పనిచేస్తున్న కార్మికులకు రెండు నెలల నుంచి సరైన సమయంలో జీతాలు రాకపోవడంతో కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని గండి మైసమ్మ-దుండిగల్ మండలం సీఐటీయూ కార్యదర్శి బొడిగ లింగస్వామి అన్నారు. సకాలంలో కార్మికులకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం దుండిగల్ మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో పలువురు కార్మికులు ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దుండిగల్ మండల కన్వీనర్ లింగస్వామి పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో కార్మికులు కష్టాలు పడుతున్నారని సరియైన సమయంలో జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దుండిగల్ మున్సిపాలిటి లో పనిచేసే కార్మికులకు 17వ తేదీ వచ్చినప్పటికి ఈనెల జీతం రాలేదని, దీంతో కార్మికులు ఇంటి కిరాయిలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిన్న చిన్న అప్పులు కట్టలేక పొదుపు గ్రూపుల డబ్బులు కట్టలేక, న నిత్యావసర వస్తువులు కొనలేక కార్మికులు అవస్థలు పడుతున్నారన్నారు. తక్షణమే మున్సిపల్ కమిషనర్ స్పందించి కార్మికులకు జీతాలు వచ్చే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల ఒకటో తారీకున ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్నామని గొప్పలు చెబుతున్నారని, కానీ దుమ్ము ధూళి మురికిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు ఇప్పటివరకు జీతాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. అదే విధంగా మున్సిపల్ కార్మికులకు రావలసిన బట్టలు, చెప్పులు, సబ్బులు, కొబ్బరి నూనె తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలను మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన ప్రతినెల 5వ తేదీ వరకు కార్మికులకు జీతాలు వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. అదేవిధంగా తొందర్లోనే సబ్బులు బట్టలు, కార్మికులకు రావాల్సిన సౌకర్యాలని ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు నరసింహ ,సురేందర్, ఎల్లయ్య, బాబు, స్వరూప, రేణుక, భవానీ, కృష్ణవేణి, లక్ష్మి, పాల్గొన్నారు

భూ భారతిపై అవగాహన అవసరం

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 17 : నూతన ఆర్ఓఆర్ చట్టం భూ భారతిపై అవగాహన పెంచుకోవాలని అధికారులకు కలెక్టర్ గౌతం సూచించారు.గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులకు అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టంలోని అన్ని అంశాలను క్షుణ్ణంగా చదివి అవగాహన పెంచుకోవాలన్నారు. 1989 ఆర్ఓఆర్ చట్టం లో ని అంశాలు భూభారతిలోని అంశాలు కొంత వరకు ఒకేలా ఉన్నాయని, ధరణిలో లేని అధికారాలు భూభారతిలో ఉన్నాయన్నారు. ఈ అధికారాలతో రెవెన్యూ అధికారులపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. ప్రతీది ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ రికార్డులను నిర్వహించాలని కలెక్టరు అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఆధార్ తరహా లో భవిష్యత్‌లో భూమికి సంబంధించి సర్వే చేసి కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో 'భూధార్' తీసుకురాబోతుందని తెలిపారు. భూముల రికార్డు ల్లో తప్పుల సవరణకు అవకాశం ఉందని తెలిపారు.

తమ్ముడిపై అన్న కత్తితో దాడి

కొండాపూర్, ఏప్రిల్ 17 : అన్నదమ్ముల మధ్య తలెత్తిన ఘర్షణలో, కోపోద్రిక్తుడైన అన్న తమ్ముడు పై కత్తితో దాడి చేసిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపల్లి మటన్ మార్కెట్ లో మటన్ షాప్ కొనసాగిస్తున్న అన్నదమ్ములు రాజు, సుభాశ్‌ల మధ్య గురువారం ఆస్తివాదాలపై గొడవ జరిగింది. గొడవలో తీవ్ర కోపోద్రిక్తుడైన అన్న రాజు తమ్ముడిపై మటన్ కోసే కత్తితో దాడి చేశాడు. దాడిలో సుభాశ్ తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్ కు తరలించారు. సుభాశ్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జేఎన్టీయూలో ముగిసిన టెక్నికల్ ఫెస్ట్

విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న వర్సిటీ రెక్టార్ విజయ్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకట నరసింహారెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 17: జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ లో నిర్వహించిన టెక్నికల్ ఫెస్ట్ గురువారంతో ముగిసింది. టెక్నికల్ ఫెస్ట్ ను వర్సిటీ రెక్టార్ విజయ్‌కుమార్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ వెంకట నరసింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని, సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని సూచించారు. వర్సిటీ అనుబంధ కళాశాలల విద్యార్థులు... ప్రతిభను సృజనాత్మకతను జోడించి రూపొందించిన ప్రాజెక్టులు అద్భుతంగా ఉన్నాయని అభినందించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాల కూల్చివేత

నిజాంపేట్ తురుకచెరువులోని నిర్మాణాన్ని కూల్చి వేస్తున్న అధికారులు

దుండిగల్, ఏప్రిల్ 17: బాచుపల్లి మండల రెవెన్యూ అధికారులు గురువారం మండల పరిధిలోని ప్రభుత్వ భూములు, చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలసిన నిర్మాణాలను తొలగించారు. బాచుపల్లి మండలం నిజాంపేట తురకచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలిసిన ఓ నిర్మాణంతోపాటు, సర్వేనెంబర్ 191 సైదప్ప కాలనీలోనీ ఓ నిర్మాణంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు రావడంతో గురువారం తాసీల్దార్ పూల్ సింగ్ ఆదేశం మేరకు గిర్దావర్ భాను చందర్ ఆధ్వర్యంలో రెండు నిర్మాణాలను జేసీబీ సహాయంతో తొలగించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా, చెరువు, కుంటల ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టిన ఉపేక్షించేది లేదన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ సతీశ్‌గౌడ్ ను అభినందిస్తున్న కాలనీ వాసులు

బాలానగర్, ఏప్రిల్ 17 : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపిస్తున్నట్లు ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. గురువారం జరిగిన పరిధిలోని జవహర్ నగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కా లనీవాసులను కలిసి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జవహర్ నగర్ కాలనీలో ఇటీవల రూ 15 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు పూర్తి చేసి నందున కాలనీవాసులు ప్రశంసలు కురిపించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాము ముదిరాజ్, వెంకటేష్, శ్రీనివాస్, జితేందర్, కీర్తి, ఉమా రాణి, జయమ్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

మూసాపేట ఏప్రిల్ 17: అదృశ్యమైన వృద్ధురాలు... అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన కూకట్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... మూసాపేట చిత్తరమ్మ ఆలయం సమీపంలో నివాసం ఉంటున్న లక్ష్మమ్మ(63) ఈనెల 11న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మృతురాలికి కల్లు తాగే అలవాటుతో పాటు మతిస్థిమితం సరిగా ఉండదు. మృతురాలి బంధువులు చుట్టుపక్కల వెతికిన ఫలితం లేకపోవడంతో 12న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. గురువారం మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డు లోని జ్యూస్ సెంటర్ వెనకాల కుళ్లిపోయిన స్థితిలో అనుమానాస్పదంగా పడి ఉన్న మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని విచారించగా లక్ష్మమ్మగా తేలింది. ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఓయూ నుంచి లాలాపేట్‌కు రాకపోకలు

సిటీబ్యూరో, ఏప్రిల్17 (నమస్తే తెలంగాణ): గతంలో మూసేసిన తార్నాక జంక్షన్ ను నేటి మే 2 వరకు పదిహేను రోజుల పాటు రాకపోకలకోసం తిరిగి ప్రారంభిస్తున్నట్లు హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ జోయల్ డెవిస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ వైపు నుంచి లాలాపేట్ వైపు తిరిగి లాలాపేట్ నుంచి ఉస్మానియా యూనివర్సిటీ వైపు వాహనాలు ప్రయాణించడానికి అనుమతించబడతాయన్నారు.

ఈ మార్గాల్లో వెళ్లొచ్చు..

ఓయూ నుంచి వచ్చే వాహనాలు లాలాపేట్ వైపుకు నేరుగా వెళ్లవచ్చు. హబ్సిగూడ వైపు కుడివైపు మలుపు తీసుకోవచ్చు. లాలాపేట్ నుంచి వచ్చేవి ఉస్మానియా యూనివర్సిటీ వైపుకు నేరుగా వెళ్లవచ్చు. మెట్టుగూడ వైపు కుడివైపు మలుపు తీసుకోవచ్చు.

ట్రాఫిక్ అనుమతించనిది..

మెట్టుగూడ నుంచి వచ్చే వాహనాలు ఉస్మానియా యూనివర్సిటీ వైపుకు కుడివైపు మలుపు తీసుకోవడానికి అనుమతించబడవు. బదులుగా, వాహనాలు నేరుగా హుడా కాంప్లెక్స్, తార్నాక వైపు వెళ్లి అక్కడ 'యూ' టర్న్ తీసుకొని తార్నాక వద్ద ఎడమవైపు మలుపు తీసుకొని ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లాలి. హబ్సిగూడ నుంచి వచ్చే వాహనాలు లాలాపేట్ వైపు కుడివైపు మలుపు తీసుకోవడానికి అనుమతించబడవు. వాటి బదులు, నేరుగా ఇక్రిశాట్ వైపుగా వెళ్లి అక్కడ 'యూ' టర్న్ తీసుకొని తార్నాక జంక్షన్ వద్ద ఎడమవైపు మలుపు తీసుకొని లాలాపేట్ వైపు వెళ్లాలి.